

# వెలుగు

పాలకోడేటి సత్యనారాయణరావు

కళ్ళు మూతలు పడిపోతున్నాయంటే దానికి కారణాలు రెండు. ఆకలేస్తోంది; నిద్రొస్తోంది. నిద్రపోతే, ఆకలినుంచి కొంచెం దూరం కావచ్చు. కానీ...నిద్రపోవటం అంటే...

వద్దు- బహుశా నా జీవితంలో ఇంక కన్ను మూసి ఆదమరచి నిద్రపోగలిగే ఆ రోజులు పోయినట్లు ఉన్నాయి. కన్ను మూస్తే ఏ అవాంతరం ఏ రూపంలోవచ్చి మీద పడుతుందోనన్న భయమే!

నిన్నటివరకూ భయమంటే ఎరగనివాణ్ణి

**దొంగతనం చేసేంత ధైర్యం లేనివాణ్ణి. కానీ దొంగతనం చేయనే చేశాను. చేసి, దొరికిపోయాను. దొరికిపోవటం నా దౌర్భాగ్యం!**

ఈ రోజు- ఈ క్షణంలో- ఇలా ఊరికి దూరంగా, మనుషులకు దూరంగా, జంతు సమానంగా ఈ ఊడల మర్రిక్రింద, అనామకుడిగా బతకటం ఆశ్చర్యంగా వుంది, బాధగా వుంది. కానీ... ఏమిటో భయం నన్ను ఇలా మార్చేసింది.

ఈ భయం ఇంతలా నన్ను చంపుకు తినేస్తుందని నాకు తెలిసివుంటే, బహుశా ఆ పని నేను చేయగలిగేవాణ్ణి కాను. కానీ, భయంవేరు, ధైర్యం వేరు. ఆ క్షణంలో నన్ను ఆవహించిన ఆ వెర్రి ఆవేశం నన్ను ధైర్యవంతుణ్ణి చేసింది. అందుకే...

ఏమిటో, ఒకటే ఆకలిగా వుంది.

కళ్ళన్నీ తిరుగుతూ...ఇదే చివరిసారి ప్రపంచాన్ని చూడటమా అన్నంత బాధ...

ఈ ఆకలిబాధ భరించలేకే ఆ రోజున... అయినా కళ్ళు మూసినా తెరిచినా కనిపిస్తున్న పీడకల!

—రోజంతా ఆ జంక్షన్‌లోనే నిలబడ్డాను. పొద్దున్ననుంచి ఒకటంటే ఒక్క బేరమూ

తగలలేను. ఒక్కబేరం దొరికివుంటే, ఏదో ఈ పూటకింత గంజి దొరికేది.

కానీ... తూర్పున ఉదయించే సూర్యుడు పడమటివైపు కుంగిపోవటం నాకు కనిపిస్తూనే వుంది. నా కడుపులో పేగులు ఉంగలుచుట్టి నన్ను మరింత క్రుంగదీయటం నాకు తెలుస్తూనే వుంది. ఇంట్లో నా చిన్న ప్రాణాలు... ఏమో ఊహించుకోవటం కూడా కష్టమే !

అందుకే చీకటిపడ్డాక, నా మనస్సును కొంచెం మళ్ళపెట్టి, రిక్షాను ఓ పక్క నిలబెట్టి పైపులైను మీంచి ఆ ఇంట్లోకి దూరాను. చేస్తున్నది తప్పని అని తెలిసినా, తప్పనిసరి రెండురోజులకు సరిపడే... రేపు ఎలాగయినా రిక్షా తొక్కలేనన్నది నిజం! పప్పులు, బియ్యం మూటగట్టుకొన్నాను. ఎక్కిన దారివెంబడే దిగుతోంటే కింద నాకోసం పోలీసు కాపేశాడన్న సంగతి నాకేం తెలుసు ? వెళ్ళి అతనిముందు నిలబడ్డాను.

దొంగతనం చేసేంతధైర్యం లేవాణ్ణి- కానీ దొంగతనం చేయనే చేశాను. చేసి, దొరికిపోయాను. దొరికిపోవటం నా దౌర్భాగ్యం !

—చేతిలోవున్న వస్తువులు నా దొంగతనానికి సాక్ష్యంచెబుతూ, నా చేతకానితనాన్ని చాటి చెబుతున్నాయి.

పోలీసు వెంట మౌనంగా పోలీసు స్టేషన్‌కు నడిచాను.

—అప్పటివరకూ నాలోవున్న ఆ మొండితనం ఆవిరిలా ఎటు మాయమైపోయిందో తెలీటంలేదు. నన్ను అన్ని పక్కలనుంచీ అవమానం ఆవరించివేసింది.

అందుకే—

మర్నాడు పోలీసు స్టేషన్‌నుంచీ కోర్టుకు వెళ్ళబోయే సమయంలో... అదనుచూసి పారిపోయాను.

—ఇప్పుడు ఇక్కడ ఇలా... ఏమిటో, ఏం చేయాలని బయలుదేరితే, ఏం జరుగుతోంది ?

కడుపునిండా కూడుకోసం కూడా ఎన్ని అవస్థలు ? ?

జేబులోఉన్న పైసలు లెక్కవేస్తే, ఇరవై రెండున్నాయి. ఈ ఇరవై రెండు పైసలతో ఓ రొట్టిముక్క కొనుక్కుంటే... ?

కొనుక్కోవచ్చు. కానీ—ఊళ్ళోకి వెడితే- ఎవరైనా పోలీసు చూస్తే...?

భయం-ఆకలి. ఒకదాన్ని మించి ఇంకొకటి నన్ను ఆక్రమించుకొంటున్నాయి.

అయినా ఆకలిముందు భయం ఓడిపోవటంతో ముందుకు నడిచాను.

ఊరంతా మామూలుగానే వుంది. నేను పారిపోవటం పెద్ద సంచలనాన్ని కలిగించనే లేదు. అందుకే- వెళ్ళి ఓ రొట్టిముక్కకొని, తిరిగి వచ్చేశాను ఊడల మర్రి కిందకు. పొట్లం విప్పి రొట్టిముక్క ఆదరబాదరగా తినేశాను. తిన్నాక ఏం చేయాలో తెలీక, ఆ పొట్లం కాగితాన్ని విప్పాను. చదునుచేసి ఒక్కో అక్షరం చదవటం మొదలుపెట్టాను.

ఆ పేపర్లో వార్త చదివేసరికి, నా గుండెలు అవిసిపోయాయి.

ఎందుకిలా జరిగిపోయింది ?

* * *

రంగమూర్తి :

—ఎంత అవమానం జరిగిపోయింది ?

ఈ ముఖంతో ఇంక ఎవర్నయినా ఎలా చూడాలి ? ఇన్నేళ్ళ తర్వాత జీవితంలో ఇలాటి సంఘటన... అయినా ఎలా జరిగింది?

ఆ రోజు—మామూలుగా బీటు నాదే—మామూలుగా అలవాటైన దారి. అలవాటైన కళ్ళు. పరధ్యానంగా నడుస్తూనే వున్నాను. కానీ దృష్టి ఎంతైనా పోలీసు దృష్టేకదా! అందుకేకాబోలు, ఆ చీకటిచాటున రిక్షా నా కళ్ళ వడనేపడింది.

చీకటిచాటు రిక్షా అంటే తెలుస్తూ నేవుంది దాని స్వభావం ఏమిటో!

ఏ ఆడకూతురో తన ఆదతనాన్ని అమ్ముకోవటానికి వచ్చి వుంటుంది. అంతకన్నా ఆ రిక్షాలో ఇంకేం వుంటుంది? రిక్షాలో ఆడది కూర్చునివుంటే, రిక్షావాడు జేరం కుదుర్చుకొని వస్తాడు.

ఇది మామూలు కథే నాకుతెలుసు అందరికీతెలుసు హెడ్డు నారాయణస్వామి కీ తెలుసు, యస్సై వెంకటాచారికీ తెలుసు. కానీ వాళ్ళు ఇద్దరూ కళ్ళు మూసుకుంటారు, రంగమూర్తీ కన్ను తెరిస్తే నేరమే కనబడుతుంది. అందుకే మూసుకోవాలి! అంటాడు నారాయణస్వామి, కానీ చేసేది కళ్ళు మూసుకో గలిగే ఉద్యోగం కాదు.

అందుకే-రిక్షాకేసి నడిచాను. ఆశ్చర్యం! రిక్షా ఖాళీగా వుంది. అంటే బేరం కుదిరితే ఉంటుంది. బ్రోతల్ ఆక్టు ఉన్నా లాభం లేదు, మనిషిలో రావాలి మార్పు.

అక్కడే కాపలా వేసాను.

క్షణం తర్వాత, పైన ఏదో అలికిడి అయితే తలెత్తిచూశాను. పైనుంచి దిగుతూ. దొంగ వెధవ!!

రిక్షా ఉండి కూడా దొంగతనం-మనుషులకు 'ఈజీమనీ' అంటే ఎంత కోరికో?-కిందకు దిగగానే పట్టుకున్నాను. వాడిచేతిలో ఉన్నవి- పప్పులు, బియ్యం... బాధ కలిగింది. కానీ దొంగతనం దొంగతనమే?

దొరికిన దొంగ మౌనంగానే వచ్చాడు నాతో స్టేషన్‌కు,


రేపు గురించి ఈ రోజే ఆలోచించండి

# చదవండి

## '1977 లో మీ భవిష్యత్తు తెలుసుకోండి'

అశ్వని మొదలు రేవతి దాకా గల 27 నక్షత్రాలకూ విడివిడిగా ప్రతి నక్షత్రానికి 1977 లో భవిష్యత్తు ఎలా వుంటుందో విపులంగా వ్రాయబడిన విశేష గ్రంథం.

1. కుజదోషమంటే ఏమిటో యీ పుస్తకంలో వివరించబడింది
2. వధూవరుల జాతకాలను పరిశీలించి, గుణాలను లెక్కగట్టే పద్ధతి విశదంగా వ్రాయబడింది.
3. తెలుగు చాంద్ర మాన సంవత్సరాలకు సరియైన ఇంగ్లీషు సంవత్సరాలు తెలుపబడ్డాయి.
4. ఆంధ్రదేశంలోని అన్ని తాలూకా పట్టణాలకూ సరియైన అక్షాంశ రేఖాంశలు యివ్వబడ్డాయి.

ప్రతులకు, ఏజన్సీ వివరాలకు:

అస్ట్రాలాజికల్ రీసర్చి సెంటర్

6-3-596/43, వెంకటరమణా కాలనీ, హైదరాబాదు-4.

మౌనం మౌనంగా ఉండదనీ, మర్నాడో, రెండు రోజుల తర్వాతో బాంబులా పేల బోతోందని నాకేం తెలుసు?

ఆకలి కోసం చేసిన దొంగతనం మీద గౌరవం కొద్దీ - కొంచెం అజాగ్రత్తగానే ఉన్నానేమో!-లేకపోతే నామీద నాకే ఆత్మ విశ్వాసం బలిసి పోయిందేమో, తెలీదు- కోర్టుకు వెడుతోంటే దొంగ పారిపోయాడు?

ఎంత ఘోరం జరిగిపోయింది!

ఇన్నేళ్ళ నా సర్వీసు వృధా అయి పోయింది. మచ్చలేని నాసర్వీసులో బ్లాక్ మార్క్ పడిపోయింది. జీవితంలో ఏ పోలీసుకైనా ఇంతకన్నా ఓటమి ఇంకోటి ఉండదు.

హెడ్డుకు చెబితే, హెడ్డు యస్సైకి చెబితే అలా అంచెలంచెలుగా చివరకు...సస్పె న్షన్ ఆర్డరు వస్తుంది. అది శిక్ష కానేకాదు!

కానీ- ఈ అవమానం... నేను భరించ లేనిది.

ఈ ఓటమిలోంచి నేను తలఎత్తుకోలేను. అందుకే...

కోర్టు ఆవరణకు చేరాక, ఆ చెట్టు కింద, ఈ అవమానాన్ని భరించలేక నేను తుపాకి తీశాను. గురిచూసుకొని ఒక్క గుండు పేల్చాను.

-ఆ గుండు నా గుండెల్లోకి దూసుకు పోయింది.

అవమానం కన్నా ఇదెంత హాయిగా ఉంది.!!

* * *

**కృష్ణమూర్తి :**

-మనిషి ఆకలికి తట్టుకోలేక చేసేనేరం నేరమే అవుతుందా? తనకు తెలీదు. కోర్టులో కూర్చొన్న ఆ పెద్దలకు తెలుసో, లేదో తనకు తెలీదు.

దొంగతనం చేసిన మాట వాస్తవమే గానీ, దానికి కారణం ఎవరికీ అక్కర్లేదు.

-అలాగే కారణాన్ని శిక్షించలేని వాళ్ళు తన్ను శిక్షించటం జరుగుతుంది! అందుకే శిక్షనుంచి దూరంగా పారిపోయి, ఈ ఊడల మర్రి కింద...

కానీ, పేపరు ఏం చెబుతోంది!

తను తెలిసి తెలిసీ చేసిన తప్పుకానే కాదు.

పారి పోతున్న క్షణంలో పోలీసు గురించి తను ఆలోచించనే లేదు. ఆలోచించి ఉంటే...?

ఆ పోలీసు, తను పారిపోవటం అవమా నంగా భావించి, ఆత్మహత్య చేసుకోవటం. ఊహూ, ఇది అన్యాయం.

దొంగతనం చేసింది తను. శిక్షపోలీసుకు అయింది..

అయినా ఎంత గొప్పవ్యక్తి- ఉద్యోగ నిర్వహణలో లోపం జరిగిందని ఆత్మహత్య చేసుకోవటం... ఎంత గొప్ప పని ?

ఆ పోలీసెవరో తనకు తెలీదు.

కానీ, ఎంత గొప్ప పాఠం నేర్పాడు అతను!

ఆ కాగితాన్ని చేత్తో పట్టుకుని ముందుకు, నడిచాను. చనిపోయిన ఆ పోలీసు దారి చూపిస్తోంటే !

అరగంట తర్వాత పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కి, లోపలకు అడుగు పెట్టగానే, యస్సై నన్ను చూసి నిలబడ్డాడు.

నాకు తెలుసు జైలు గదులంటే చీకటి కొట్టాలని ! కానీ ఆ చీకటి గదులలో నాకోసం కొండంత వెలుగు కాచుకొని ఉందన్న సంగతి ఎందరికి తెలుసు? *